

# ముద్దు చేసిన కుక్క !

'' ఆఫీసరు నిదానరావుగారండీ, అదో మోస్తరు మనిషి'' అని తన విచారం, ఆశాభంగం వెల్లడించాడు రచయిత రఘుపతి. గృహిణి యిచ్చిన డ్రింక్ తాగాడు.

''మీ బాధనాకర్థమైంది. సరైన పదం వాడలేక సభ్యత చూపారు. థాంక్స్. కాని అదో మోస్తరు స్వభావం ఒక్క సాహిత్యానికీ, దాన్ని ప్రచురించుకునే విషయంలోనే గాదు. నేను బాగా నోటీస్ చేశాను. నమ్మరేమో. గృహసంబంధమైన విషయాలలోనూ గూడా ఆఫీసరుగారు అదో మోస్తరు మనిషే. ఆచార వ్యవహారాలలోనూ అంతే. పనివారి విషయం తీసుకోండి. బాగా నెత్తి నెక్కించుకుని, వాళ్లకు అనుకూలంగా వుండి, అమ్మా, తల్లీ!, నాయనా! బాబు బాబు అని ముద్దు చేస్తూ వుంటే, సాయిలా పాయిలాగా వుంటే, పనివాళ్లు తక్కువజీతంతోనే అన్ని పన్లూ చేసి పెడతారుట. అదీ వాదన. ఆచరణలోనూ అంతే. నాకు నమ్మకం లేదు. ముద్దు చేసిన కుక్క యేదో చేసిందట. అలా చేస్తున్నారని చూపితే, వినబడనట్టు చూస్తూ వుండిపోతారు. మరీ భరించలేక బుజావుచేస్తే 'చివరి కేదో చేస్తారు' అని హామీ యిచ్చారు. దేవుడు చూడండీ. పాపం బాగా పండనిచ్చి శిక్షిస్తానంటాడు. అలాగా'' అని నవ్వింది, రచయిత్రి అని పేరు పొందాలని ఆరాటపడుతున్న నీలిమ. '' ఆయన పేరే నిదానరావు!'' అని మరోసారి నవ్వింది.

ఫ్రీగా మాట్లాడింది గదా అని, చల్లని డ్రింక్ యిచ్చింది గదా అని రఘుపతి ''అంత పటుత్త్వంగా ఇంటరెస్టింగ్‌గా రచన చేయగల మనిషిని యింట్లో వుంచుకుని, ఆ టాలెంట్‌మీద డబ్బు చేయాలని లేదంటే యేమనుకోవాలీ?'' అన్నాడు చొరవగా.

''పెట్టుబడి పెట్టరు అనుకోవాలి. మోటగా చెపితే, లంచమివ్వడు పట్టడు అనుకోవాలి. హాస్యంగా చెప్పితే వెర్రి వెయ్యివిధాలు అనుకోవాలి'' అన్నది నీలిమ.

''బాగా అన్నారు'' అని లేచాడు రఘుపతి. ''మనసు మార్చుకుని అనుకూలంగా మాట్లాడితే నాకు ఫోన్ చేయండి. మేము పెట్టుకున్న పత్రిక ఆర్థిక యిబ్బందులకు లోనైంది'' అని తలొంచుకు వెళ్లిపోయాడు.

గది చిమ్ముతున్న సుభాషిణి నీలిమ వున్న చోటికి వచ్చింది. '' ఆడెవరు? నీకేమౌతాడు. బంధువా? యేటంటాడు. బాబున్నప్పుడెందుకు రాడు? యేటి కావాల?'' చీపిరితాడు వదులైందని ముడిపెడ్తూ చీపిరి తిప్పుతున్నది.

'' ఆయన రచయిత. ఎడిటరు. పత్రిక నడుపుతున్నాడు. 'బాగా రచిస్తున్నారు. మీకు తోచిందివ్వండి. వారం వారం మీ కథ వేస్తాము అంటున్నాడు'. 'నాకు స్వంత డబ్బు లేదు. వంట చేస్తానంతే. సరుకులు ఆఫీసరుగారే తెప్పించి స్టోర్ రూమ్‌లో వుంచుతారు. అని చెప్తున్నాను'' అన్నది నీలిమ.

''నన్ను మెయిడ్ అని పిలవకు. అలా యెవరితోనూ చెప్పకు. నా పేరు సుభాషిణి. బాబునడగమని చెప్పలేవూ ఆడితో'' అన్నది.

''బాబు యిస్తాననలేదుట. ఇవ్వలేదుట'' అని పోబోయింది నీలిమ. సాయంత్రం అయిదున్నరయింది. వంట వేళైంది.

''నే చెప్తాలే బాబుతో. నే నెట్ల చెపితే అట్ల చేస్తాడు. నే చదివాగా నువ్వు రాసిన కథలు. బాగానే రాశావు.'' అలా అంటూ వెళ్లి చీపిరి గదిలో పారేసి వెళ్తున్నది. ''రేపు చిమ్ముతాలే. బడినించి ఆలస్యంగా వచ్చాను. వళ్లు నెప్పులు. నడవాల. సెప్పుల్లేవు. నువ్వు కొనివ్వాల. నమ్మకంగా చేస్తున్నా గదూ'' అని వెళ్లి పోయింది.

నీలిమ వంటకుపక్రమించింది. సుభాషిణి తల్లి నూకాలమ్మ వచ్చింది. చంకలో బిడ్డ. 'పెద్దుల్లి ఒకటీ వెల్లుల్లి ముక్క ఒకటీ కావాలి. జల్లెడివ్వు. బూర్లొండాల. పిండి జల్లించాల. రోకలి కోసం వచ్చినపుడు మరిచి పోయినా.'' అన్నది.

అవి అక్కడుంచింది నీలిమ. అవి తీసుకుని నూకాలమ్మ వెళ్లింది. పెద్దకొడుకు ముత్యాలయ్య వచ్చాడు.

''టార్టాయిజ్ వెలిగించి యియ్యి. ఎలక్ట్రిక్ పంప్‌తో నీళ్లుపై టాంక్‌లో కెక్కించమన్నాడు బాబు. పంప్ వున్న చోటంతా దోమలు.'' అని నిలబడ్డాడు.

టార్టాయిజ్ వెలిగించి స్టాండుకి గుచ్చి యిచ్చింది నీలిమ. ముత్యాలయ్య అది తీసుకుని వెళ్లిపోయాడు. రెండో కొడుకు నాగరాజు వచ్చాడు. పెద్దస్టాండు తెచ్చాడు. ''ఫానులన్నీ తుడవమన్నాడు బాబు. నాకు పొద్దున తీరిక లేదు. పన్లోకెల్లినాను. ఇపుడే వచ్చినాను. సబ్బు నీళ్లూ, తుడిచే గుడ్డ, మంచినీళ్ల డబ్బా యియ్యాల.'' అని నిలబడ్డాడు.

అవి అందించింది. వంటింట్లో ఫానూ, డైనింగ్ రూములో ఫానూ అయినై, హాలులో కెళ్లాడు.

''బల్ల పట్టుకోవాలా?'' అంటూ వాడి అక్క అచ్చియ్యమ్మ వచ్చింది.

''అక్కర్లా.'' అన్నాడు తమ్ముడు.

'' ఇల్లు సిమ్మిందా నా సెల్లి?'' అని అడుగుతూ వంటింట్లో కొచ్చింది.

''చిమ్మింది'' అన్నది నీలిమ.

''సిమ్మ లేదన్నదే. నేబాగ సిమ్ముతా'' అంటూ చీపిరి తీసికెళ్లింది.

బెడ్‌రూమ్‌లో దూరింది. లైటేసింది. నిలువుటద్దంలో చూసుకుంటూ నవ్వుకుంటూ, పూలదండ కనబడాలని రెండో వేపు తిరిగితే కనబడలేదు. అల్మర తీసి అద్దం తీసింది. రెండద్దాలలో చూసుకుంటూ నవ్వింది. అద్దం అల్మరలో వుంచుతూ, వేలాడుతున్న చొక్కా జేబులు వెతికింది. మూలగా వున్న భరిణలోని చిల్లర తీసుకొని నవ్వుకుంటూ బొడ్లో దోపుకున్నది. చీపిరి గదిలో నేలమీద విసిరేసి వెళ్లిపోయింది.

ఫాన్లు తుడవటమైపోయింది. నాగరాజు స్టాండు షెడ్‌లో వుంచి తలుపు మూసి వెళ్లాడు. నీలిమ చపాతీలు వత్తుతున్నది.

నిదానరావు ఆఫీసునించి వచ్చాడు. ''నీలిమా!'' అని కేకలేస్తూ వెళ్లి బెడ్‌రూమ్‌లో లైటు వేశాడు.

నీలిమ పని వదిలివచ్చి నిలబడింది.

''చీపిరిక్కడెందుకుంచావు?'' అని అడుగుతూ బూట్లూ, మేజోళ్లూ వూడదీస్తూ సోఫాలో కూచున్నాడు.

''నేను వుంచలేదు. మీ మెయిడ్ యిల్లు చిమ్ముతానని వచ్చి, చీపిరక్కడ పడేసి, నిలువుటద్దంలో చూసుకుంటూ తలదువ్వుకుని వెళ్లి పోయింది'' అన్నది నీలిమ.

''దగ్గరుండి యిల్లు చిమ్మించుకుని, చీపిరి వరండాలో పెట్టించాలి.'' అన్నాడు నిదానరావు నవ్వుతూ.

''టైమేదీ? వంటా చపాతీలూ, యీ లోపల మీ సర్వెంట్స్‌కి అన్నీ అందించాలి. వాళ్లకు వీలుగా వున్నప్పుడొస్తారు. మీరు ఆర్డరు వేసిపోయిన పని చేస్తాము అన్నీ అందించమంటారు. అన్నీ చేయలేను. కూచోనూ లేవనూ వంగోనూ'' అని వెళ్లిపోయింది నీలిమ.

2

నిదానరావు కాంప్ వెళ్లాడు. కొళాయి నీళ్లు రాలేదు. వున్న నీళ్లే సరిపెడుతూ, టీ, టిఫిన్ చేస్తూ, పనివాళ్ల కన్నీ అందిస్తూ, టైమ్ చూస్తూ, కొళాయి వంక చూస్తూ పనిచేసుకుంటున్నది నీలిమ.

పిల్లలు బడికి వెళ్లిపోయారు. నీళ్లైపోయినాయని దొడ్లో తొట్టిలో నీళ్లున్నాయోమోనని చూసి కొళాయి తిప్పి గిన్నెతో తేవాలనీ, కరివేపాకూ కొత్తిమేరా కోసి తెచ్చుకోవాలనీ దొడ్లోకెళ్లింది నీలిమ. సుభాషిణి యింట్లో కెళ్లి పేస్ట్ నొక్కి మొహం కడుక్కుని, హేంగర్ కున్న టవల్‌తో మొహం తుడుచుకుని అక్కడున్న దువ్వెనతో తల దువ్వుకున్నది. అద్దంలో చూసుకుంటూ గుడ్డలు మార్చుకున్నది. విడిచినవి వుండచేసి పట్టుకొచ్చింది.

''తలుపేసుకో. బాబు యింట్లో లేడు. జాగర్తగా వుండాల'' అని పరుగుతీసింది.

తండ్రి పాపయ్య బిందెలలోకి నీళ్లు పడుతున్నాడు. మొహం వుబ్బివున్నది. కళ్లు యెర్రగా వున్నాయి. చుట్ట వాసనా. మీది కొచ్చాడు. పెద్ద యాక్షన్ చేస్తూ చెయ్యెత్తి కొట్టబోయినట్టు అభినయించాడు.

''గుడ్డలు దొడ్లో వదిలేసి తలుపేసుకుంటే, దొంగెదవలు గుడ్డలెత్తుకుపోరూ? బాబు నన్ను నిలేస్తాడు. 'నిన్ను వాచ్‌మన్‌గా పెట్టి జీతమిస్తున్న దెందుకూ అన్నీ పోవటానికా?' అంటాడు. నీకెన్నిసార్లు చెప్పాల గుడ్డలింట్లో యెట్టుకోమని?'' అలా అంటూ బిందెల నిండా నీళ్లు పట్టాడు. చివరికి నిలబడే వున్న నీలిమను చూసి, ''నీళ్లు కావాలా? కొలాయి రాలా? పట్టుకో'' అని నీళ్లు నిండిన బిందె బుజాన పెట్టుకెళ్లాడు.

నూకాలమ్మ పిల్లవాడిని చంకనేసుకొచ్చింది. వేరుశనగ నూనె అయిపోయిందట. వంటకు నూనె కావాలిట. గిన్నె కిందవుంచింది.

''ఈడు సంకదిగడు. మట్టి తింటాడు. నెత్తిన పోసుకుంటాడు. అందుకని కూతుళ్లను యిల్లు వూడ్చి రమ్మని పంపుతున్నా. ఈడు సంకదిగగానే నడక రాగానే, నేనే సిమ్ముతా యిల్లు. అళ్లు బాగా సిమ్మటం లేదన్నాడట బాబు'' అని కొడుకును ముద్దులాడుకుంటూ నిలబడింది.

''నేను వేరుశనగ నూనె వాడను'' అన్నది నీలిమ.

''నువ్వు వాడేదే యివ్వు'' అని వెళ్లకుండా నిలబడి కొడుకును పైకెత్తి ముద్దులాడుతూనే వున్నది నూకాలమ్మ.

3

''దాన్ని నా గదిలో కెందుకు పోనిస్తున్నావు?'' అన్నాడు నిదానరావు. వాచీ, పెన్నూ కనబడలేదట. ఇంగ్లీష్ లెదర్ అనే షేవింగ్ క్రీమ్ మీద మూతలేదు గదంతా క్రీమ్ వాసన. మాట గూడా నిదానంగానే వుంటుంది.

''మీరు నిద్ర లేవకముందే అది యిల్లు చిమ్ముతుంటే, 'దుమ్ము లేస్తున్నది. మంచం కుదుపుతున్నావు? తర్వాత చిమ్ము' అన్నారట మీరు. అందుకని పొద్దెక్కి మీరు వెళ్లాక గది చిమ్ముతానని వచ్చి అందులో దూరుతున్నది. నేను వంట చేయాలి, స్నానం, కారియర్లు, సర్ది రెడీగా వుంచాలి. కూడా వుండి చిమ్మిస్తుంటే యేమేమి కొనిబెట్టాలో చెపుతుంది. చెప్పులు కొనివ్వలేదుట నేను. యాభైపెట్టి బాటాలో కొనుక్కొచ్చిందట. బిల్ చూపింది. కొట్టువాడితో, 'మా యమ్మ యిస్తానన్నది. తెచ్చిస్తానని చెప్పి అప్పు పెట్టి వచ్చిందట.' ఆ యాభై నువే యీయాల. యెవుడిస్తడు? అని మీద కొచ్చి అరిచింది. మీరు పెందరాళే నిద్దర్లేచి యిల్లు చిమ్మించుకోండి. నేను వాళ్ల చేత దెబ్బలు తినను. వాళ్ల నాన్నా కొట్ట వచ్చాడు'' అన్నది నీలిమ.

''పాంట్ జేబులో పర్స్ యేదీ? దాన్ని నాలుగు డబాయించలేవూ?'' అని విసుక్కుని డ్రెస్ చేసుకుని ఆఫీస్‌కి తయారైవచ్చాడు నిదానరావు.

''మీరు వాళ్లకు వత్తాసు పలుకుతూ, వెనకేసుకొస్తూ నన్నే కూకలేస్తున్నారు వాళ్ల యెదుట. అందుకని వాళ్లకి లోకువైనాను. నాకు వెరవరు. తిరిగి అంటారు. గతిలేక మీ పంచన చేరానని అనుకుంటున్నారు'' అని కళ్లు తుడుచుకుంటూ వెళ్లిపోయింది నీలిమ.

నిదానరావు గేటు దగ్గరకెళ్లేటప్పటికి రెండు జీపులున్నాయి. ఒకటి తను వెళ్లేందుకు. రెండోది పోలీస్ డిపార్ట్‌మెంటుది.

పాపయ్య యేడుస్తూ వచ్చి నిదానరావు పాదాల మీద పడ్డాడు. ''నా కొడుకు సైకిలు కావాలని, తిండి మాని కిందబడి పొర్లుతూ యేడుస్తున్నాడు. నిన్నటేలనించీ చూస్తుంటే, యియాల సెకండ్ హాండ్ సైకిల్ అమ్మకానికొచ్చింది. వందరూపాయలు అప్పుతెచ్చాను దొరా. నువ్వొక రెండొందలిస్తివా సైకిలు వాడికిస్తా. జీతం పట్టుకో. అప్పు తీరుద్ది'' అని మొత్తుకున్నాడు. జీప్ నుంచి యస్సై, నలుగురు కానిస్టేబుల్స్ దిగి వచ్చారు. చూస్తుండగా నూకాలమ్మ, పిల్లవాడిని చంకనేసుకు వచ్చింది.

''నాకు ఆపరేషన్ చేయించు బాబూ, ఇప్పటికి ఆరు కాన్పులాయె. ఇంగ నేను కనలేను. ఈడికి యాడాదెల్లిందంతే. ఇంకా పాలు వదల్లేదు. అప్పుడే గర్భమొచ్చింది. నీ కోసం రోజూ ఒక డాక్టరమ్మ వస్తదే, దానితో చెప్పు. ఆమె నర్సింగ్ హోమ్‌లో చేర్పించు'' అని కళ్లు తుడుచుకుని, చీదింది.

ఇంట్లో టివి ఆన్ చేసి, సినిమా రావటం లేదని అచ్చియ్యమ్మ టివి ఆపేసి వీధిలోకి పరుగెత్తు కొచ్చింది. ''ఇంద నీ పర్స్. కిందబడివుంటే తీశా'' అని నవ్వి పర్స్ తీసుకోమని చూపించింది.

''దాన్లో డబ్బులేదు. ఇచ్చేద్దామని మర్చిపోయినాను. గది సిమ్మతుంటే మంచం కింద కంటబడ్డాది. యెత్తి తీశానంతే'' అంటున్నది.

రెండద్దాలలో తన అందం, పూలచెండూ చూసుకుని, బాత్‌రూమ్ వాడుకుని, పౌడరద్దుకుని, సుభాషిణి చేతివాచీ తోలు పటకాబిగిస్తూ గేటువేపి వచ్చింది.

''వాచీ పనిచేయటం లేదు బాబూ! షాపులో చూపితే బాటరీ వేయాలన్నాడు. బాటరీ ముప్ఫై రూపాయలు ఇయ్యండి. నేను చెప్పులు కొనుక్కోవాలని బజారుపోతున్నా. బాటరీ వేయించుకు వస్తా. టి.వి.బాగు చేశాను. అంటెన్నా తుడిచి సరీగ్గా పెట్టాను'' అని డబ్బు కోసం చెయ్యిజాపింది.

యస్సై చేతులో దండం కొట్టుకుంటూ దానివంకే చూశాడు. కాన్‌స్టేబుల్స్ అందరి వంకా చూస్తున్నారు.

''నాదే వాచీ. దొంగసొమ్ము గాదు. ఛీ! తూ! మేమలాంటి పన్లెరగం. బాబు దగ్గర యిన్నేళ్ల నించీ చేస్తున్నాము. ఒక్క వస్తువు పోలేదు'' అన్నది.

నాగరాజు నవ్వుతూ వచ్చాడు.

'పదివేలిస్తే. ఇవాళే ఆర్డర్స్ చేతికందిస్తాము అన్నారు బాబూ. నేను సెలెక్టయినా. మీరివ్వండి. వుద్యోగంలో చేరగానే యూనిఫామ్ కొనాల. ప్రతీనెలా చెల్లుబెడతా. మాట తప్పను. నన్ను యింటికేసుకోమని మీరు యీయనకు రికమెండ్ చేయాల. అన్ని పన్లూ చేస్తాడని చెప్పాల'' అని నిలబడ్డాడు.

కానిస్టేబుల్స్ వాడి వంక చూశారు.

అచ్చియ్యమ్మ నిదానరావు చొక్కాలాగుతూ అన్నది.

''నువ్వు హామీ వుంటే, ఆటో రిషా చౌకగా యిస్తారట. అప్పుగా యిస్తారట. నెలనెలా అంచెలమీద నలభైవేలూ చెల్లిస్తాడు మా ఆయన. రోజూ బాడుగమీద వెయ్యి వస్తుందన్నాడు. పోనీ నా జూకాలూ, ముక్కుపుడకా, పట్టీలూ, మట్టెలూ నీ దగ్గరుంచుకో'' అంటున్నది.

యస్సై చిరునవ్వు చిందిస్తూ, అఫిషియల్ వారంట్స్ చూపిస్తూ, నిదానరావుతో నిదానంగా అన్నాడు.

''వీళ్లను మీరే పంపిస్తారా సార్! నేను వెంటబెట్టుకెళ్లనా? అదృష్టం కొద్దీ యివాళ ఫామిలీ అంతా ఒక్కసారే అందారు. బెయిల్ మీద విడిపించవచ్చు.''

నిదానరావు నవ్వుతూ చూస్తూ వింటున్నానన్నట్టు తలూపుతున్నాడు.

కానిస్టేబిల్స్ యస్సై సన్నకోసం చూస్తున్నారు.